సీలింగ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం

సీలింగ్ భూమిలో బోర్డు పెట్టిన రెవెన్యూ సిబ్బంది

ధారూరు, ఏప్రిల్ 25 మండల కేంద్రంలో సీలింగ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు ధారూరు తహసీల్దార్ షాజీదాబేగం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పత్తి అమృతమ్మ భర్త ఎల్లయ్య భూమి సంబంధిత ఫిర్యాదు మేరకు విచారణ చేయగా ధారూరు గ్రా సర్వేనెంబర్ 197/4, 197/5 విస్తీర్ణం 2.04 ఎకరాలు గల భూమి సీలింగ్ భూమిని ఏ.లక్ష్మి , భర్త అంజయ్య గ్రామం ధారూరు, శెట్టి లలితాదేవి భర్త శివానందం గ్రామం ధారూరు గారుల సీలింగ్ పట్టేదారుల దగ్గర (పత్తి అమృతమ్మ శంకరయ్య దగ్గర) భూమి కొనుగోలు చేశారు. వీరికి పీవోటీ చట్టం 1977 కింద నోటీసులు జారీ చేసి భూమిని స్వాధీనం చేసుకొని బోర్డు పెట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుత పంట కోత పూర్తి అయిన తదుపరి ఈ భూముల్లో ఇరువురు రైతులు పంటలు వేయరాదన్నారు. భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని అతిక్రమించిన యెడల చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్ర మంలో గిర్ధావర్ స్వప్న, సర్వేయర్ శ్రీహరి, అదనపు గిర్ధావర్ అంజలి ఉన్నారు.

మహిళా సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

కొడంగల్, ఏప్రిల్ 25: మహిళలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలని, పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అన్ని వర్గాల మహిళలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని ఓబీసీ తెలంగాణ చైర్ పర్సన్, ఓబీసీ తెలంగాణ అరెకటిక సమాజ్ కన్వీనర్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక మహాదేవి ఆలయ ప్రాగణంలో జాతీయ ఆదివాసి గిరిజన ఫెడరేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌తో కలిసి మహిళా సింహగర్జన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓబీసీ సెంట్రల్ కమిటీ, జాతీయ బీసీ మహిళా సమాఖ్య అనుబంధ సంఘాల సం యుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల మే 30వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌గర్ స్టేడియం చాకలి ఐలమ్మ ప్రాంగణంలో మహిళా సింహ గర్జన సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారి శక్తి తెలంగాణ ఉపాధ్యక్షురాలు విమల, మైనారిటీ సెక్రెటరీ మహ్మద్ బాబా పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

నాగసముందర్ గ్రామంలో ఉపాధి కూలీలతో సీపీఎం నాయకులు

ధారూరు, ఏప్రిల్ 25: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నాలుగు నెలల పెండింగ్ జీతాలను చెల్లించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ధారూరు మండల పరిధిలోని నాగసముందర్, రుద్రారం గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలను జిల్లా సీపీఎం కార్యదర్శి ఆర్.మహిపాల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు గత ఎనిమిది వారాల డబ్బులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నాలుగు నెలలు పెండింగ్ ఉందని వెంటనే చెల్లించాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉపాధి కూలీలకు పని జరుగుతున్న ప్రదేశంలో టెంట్లు, వాటర్ సౌక ర్యం, మెడికల్ కిట్లు, పనిముట్లు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్ల సౌకర్యం కల్పించకపోవడంలో పూర్తిగా విఫలం చెందారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలను పెంచా లన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.307 లు నుంచి రూ. 600లకు పెంచాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉపేందర్, రవీందర్, శివ కుమార్, శ్రీకాంత్, నర్సింహులు, బాలయ్య, లక్ష్మి, మరియమ్మ, దేవమ్మ, బుచ్చయ్య, శివరాజ్, రాములు, బందప్ప, రవీందర్ రాజు, శ్రీనివాస్, వెంకటయ్య ఉన్నారు.

చలో వరంగల్‌కు సన్నాహాలు

- భారీగా తరలి రావాలని రోహిత్‌రెడ్డి, శ్రీశైల్‌రెడ్డి పిలుపు
- వచ్చేది తమ ప్రభుత్వమేనని భరోసా

రజతోత్సవ సభ వాల్‌పోస్టర్

తాండూరు, ఏప్రిల్ 25: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తాండూరు ప్రజలు సన్నద్ధం అయ్యారు. మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ నేతలు ఉత్సాహంగా రజతోత్సవ సభకు ప్రజలకు ఆహ్వానం తెలుపుతున్నారు. ఎన్నికల ప్రచారంలా తాండూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రజతోత్సవ వాల్ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపిస్తుంది. ప్రత్యేక రాష్ట్రం కోసం పుట్టి ఎన్నో ఏండ్ల ఉద్యమ ప్రస్థానం సాగించి ఆటుపోట్లను ఎదుర్కొని స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన బీఆర్‌ఎస్ పార్టీ 25 ఏండ్ల ఆవిర్భవ పండుగకు గులాబీ నేతలు సిద్ధమయ్యారు. స్వచ్ఛందంగా సామాన్య ప్రజలు సైతం రజతోత్సవ సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. వేలాది మంది తాండూరు నియోజకవర్గం నుంచి బయలు దేరుటకు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి ముఖ్య నేతలకు సూచనలు చేశారు. కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతతో అనేక మంది బీఆర్‌ఎస్‌కు మద్దతు పలుకేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పంజుగుల శ్రీశైల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మనదే పాలన అన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా రైతులు మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుటుంటున్నారని తెలిపారు. తెలంగాణలో రానున్నది మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేసేవారికే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇక ఎన్నికలు ఏవైనా గెలుపు బీఆర్‌ఎస్‌దేనని పేర్కొన్నారు. అందుకు తగ్గట్లు గులాబీ శ్రేణులు అందరితో మమేకమై ఉండాలని సూచించారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ 25 ఏండ్ల వేడుకలకు ఇంటి పండుగలా తాండూరు నియోజకవర్గం బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. అందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైల్‌రెడ్డి

నేడు కరెంటు సరఫరా బంద్

పరిగి, ఏప్రిల్ 25: 33కేవీ కొత్త విద్యుత్ లైన్ పనుల వల్ల శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరిగి మున్సిపాలిటీ, మండలంలోని పరిగి సబ్‌స్టేషన్, రంగంపల్లి సబ్‌స్టేషన్, రాపోల్ సబ్ స్టేషన్‌ల కింద గ్రామాలకు కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హరిక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మాధారం, 11 కేవీ పరిగి పట్టణం రెండు ఫీడర్లలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తామని ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఐక్యతా ర్యాలీ

ధారూరు, ఏప్రిల్ 25; జమ్మూ కశ్మీర్ పహల్గాంలో ఉగ్ర దాడిని ఖండిస్తూ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6:00లకు ధారూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ఐక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఓప్రకటనలో తెలిపారు.

భూభారతిపై సదస్సు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 25 : రాష్ట్రప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంపై శనివారం దుద్యాల మం డల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవనం దగ్గర అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహ సీల్దార్ కిషన్ తెలిపారు. మండల పరిధిలోని రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని అయన కోరారు.

సభను జయప్రదం చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 25: పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవాల సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని, వికారాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగళ్ల అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ తగినంత సమయం ఇచ్చినా... ఇప్పటికీ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. యావత్ తెలంగాణ మొత్తం సభలో కేసీఆర్ ఏం మాట్లాడతారు అని ఎదురుచూస్తున్నారన్నారు.

పరిగిలో హిజ్రాల హల్‌చల్..

వారి వేషంలో వచ్చిన వారిని చితకబాదిన హిజ్రాలు

పరిగి, ఏప్రిల్ 25: హిజ్రాల వేషంలో డబ్బులు సంపాదించవచ్చని వచ్చిన వ్యక్తులను హిజ్రాలు చితకబాదిన సంఘటన పరిగిలో జరిగింది. వట్టపగలు, నడిరోడ్డుపై జరిగిన ఈ సంఘటనను చూసిన వారందరు ఫొటోలు తీస్తూ ఉండిపోయారు తప్ప ఏ ఒక్కరు వారిని విడిపించే ప్రయ త్నం చేయలేదు. వివరాల్లోకి వెళ్తే కొందుర్గు మండలం పులుసుమామిడి గ్రామానికి చెందిన యాదయ్య, నర్సింహులు హిజ్రాల వేషం వేసుకొని సంపాదించాలని ఆలోచించారు. ఈ మేర కు హిజ్రాల వేషంలో వచ్చి గత కొద్ది రోజులుగా పరిగిలోని దుకాణాల వారి దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పరిగిలో ఉంటున్నటువంటి హిజ్రాలు శుక్రవా రం మధ్యాహ్నం పరిగికి ఆటోలో వచ్చిన హిజ్రాల వేషంలో ఉన్నటువంటి యాదయ్య, నర్సింహులులను పట్టుకొని చితకబాదారు. పరిగిలో తామే వసూళ్లు చేస్తామని, మీరెందుకు వచ్చారంటూ ఇష్టానుసారంగా కొట్టారు. పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తామంటూ తీసుకువెళ్లగా మరోసారి ఇక్కడికి రామని చెప్పడంతో వారిని వదిలిపెట్టారు.

సీసీ వేశారు .. మట్టి పోయడం మరిచారు

దోమ, ఏప్రిల్ 25: మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో పదిహేను రోజుల క్రితం 8వ వార్డులో మ్యాకల మల్లయ్య ఇంటి నుంచి బోయిని రాములమ్మ ఇంటి వెనకాల ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వరకు సీసీ రోడ్డు వేశారు. కానీ సైడ్‌లకు మట్టి వేయకుండా వదిలేశారు. దీంతో ఆ వార్డులోని స్థానికులకు ఇబ్బందులు తలెత్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీసీ రెడ్డు సైడ్‌లకు మట్టి వేసి రాకపోకలకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రాకొండ మహిళ రాజాపూర్‌లో దారుణ హత్య

ధారూరు, ఏప్రిల్ 25: వివాహిత మహిళ దారుణ హత్యకు గురైన ఘటన ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ధారూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... దోమ మండలం రాకొండ గ్రామానికి చెందిన బండి వెంకటమ్మ (47) భర్త మైసయ్య కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేది. పరిగి పట్టణంలో లేబర్ అడ్డ మీద పరిచయమైనటువంటి ధారూరు మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన మ్యాతరి బాబయ్య తో కలిసి రాజాపూర్ గ్రామానికి వచ్చి గ్రామంలోనే రెండు నెలల నుంచి సహజీవనం చేస్తూ అతనితో కలిసి ఉంటుంది. గురువారం రాత్రి 9: 30 సమయంలో మ్యాతరి బాబయ్య తన అమ్మను చంపి వేసి ఆధారాలు తెలవకుండా పక్కన ఉన్న పాడుబడ్డ ఇంటిలో నిప్పు పెడు తుండగా గ్రామస్తులు చూడడంతో బాబయ్య పారిపోయాడని మృతురాలి కొడుకు నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిత తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు మూడు పోలీసు బృందాలతో గాలిస్తున్నామని తెలిపారు.

మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే ఈ దుశ్చర్య

పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పరిగి, ఏప్రిల్ 25 : మతాల మధ్య చిచ్చు పెట్టడమే లక్ష్యంగా ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని, పెహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని జెడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మీర్ మహమూద్‌అలీ ఖండించారు. పెహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ శుక్రవారం మజీద్ కమిటీ ఆధ్వర్యంలో పరిగిలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణం కలిగిన కాశ్మీర్‌లోనే కాకుండా దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ మోయిజ్, ఉపాధ్యక్షుడు సమీ పటేల్, కోశాధికారి పాషాబాయ్, నాయకులు మునీర్, తాహెర్‌అలీ, సయ్యద్ అయూబ్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట, ఏప్రిల్ 25: మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో ఆర్‌ఎస్‌ఎస్, హిందూ వాహిని యువకులు కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వ హించి మృతిచెందిన వారి కోసం మౌనం పాటించి వారికి నివాళులర్పించారు. ఈ సంఘటనకు కారకులైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో జగదీశ్, పాండు, కృష్ణ, అనంత్‌గౌడ్ గ్రామ యువకులు పాల్గొన్నారు.

మర్పల్లి, ఏప్రిల్ 25 : జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి ని ఖండిస్తూ, మండల కేంద్రంలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా గురువారం రాత్రి స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి, అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, మృతుల కుటుంబాలకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

లిఫ్ట్ ఇస్తామని మహిళ మెడలో బంగారం పుస్తెలతాడు చోరీ

నలుగురు ముఠా సభ్యుల అరెస్ట్ ..రిమాండ్‌కు తరలింపు

నవాబుపేట , ఏప్రిల్ 25 : లిఫ్ట్ ఇస్తామని చెప్పి కారులో ఎక్కించుకొని మాటల్లో పెట్టి మెడలో ఉన్న బంగారు గొలుసు కత్తిరించుకొని పరారైన కేసును సీసీఎస్ సీఐ బలవంతయ్య, నవాబుపేట ఎస్సై అరుణ్ కుమార్, సిబ్బంది ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2024 ఆగస్టు 2న నవాబుపేట మండలం మీనేపల్లి కలాన్ గ్రామస్తురాలు మహేశ్వరి బోనాల పండుగ నిమిత్తం పుట్టింటికి కేసారం గ్రామానికి వెళ్లి తల్లి కాంతమ్మతో తిరిగి వస్తుంది. గెట్ వనంపల్లి గేటు వద్ద బస్సు దిగి స్వగ్రామానికి వెళ్లే ఆటో కోసం ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో వికారాబాద్ వైపు నుంచి గుర్తు తెలియని ఓ వ్యక్తి కారులో వారి దగ్గరికి వచ్చి లిఫ్ట్ ఇస్తామని ఎక్కించుకున్నాడు. కారులో ముగ్గురు ఆడ, ఇద్దరు మగ మనుషులు, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తనకు తెలియకుండానే తన మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును కట్ చేసుకున్నారు. మాదారం గ్రామ శివారులో దింపి కారు ఆపకుండా వెళ్లిపోయియారు. మెడలో ఉన్న పుస్తెలతాడు చూసుకోగా కనిపించలేదు. మాయ మాటలు చెప్పి తనకు తెలియకుండా పుస్తెలతాడు దొంగలించారని దీని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై భరత్ భూషణ్ కేసు నమోదు చేశారు.

ఈ కేసులో భాగంగా జిల్లా ఎస్పీ నారా యణరెడ్డి ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ బలవంతయ్య ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి నవాబుపేట ప్రస్తుత ఎస్సై అరుణ్ కుమార్ సిబ్బంది కలిసి కేసును దర్యాప్తు చేసి మహిళ మెడలో బంగారం దోచుకెళ్లిన ముఠా సభ్యులను పట్టుకున్నారు. పట్టుబడ్డ నలుగురుని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించి ఫిర్యాదు రాలుకు సంబంధించిన సొత్తును రికవరీ చేసినట్లు చెప్పారు. కేసులో పూర్తిస్థాయి దర్యాప్తు చేసి దొంగల ముఠాను పట్టుకున్న సీసీఎస్ సీఐ బలవంతయ్యను, నవాబుపేట ఎస్సై అరుణ్ కుమార్, సిబ్బందిని ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారని తెలిపారు.

దోమల నివారణతోనే వ్యాధులు దూరం

పరిగిలో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి, ఏప్రిల్ 25: దోమల నివారణతో అనేక వ్యాధులు దరిచేరవని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరిగిలో చిట్యాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమలు ఆవాసం ఏర్పరచుకోకుండా చూసుకోవాలన్నారు. ఇండ్ల చుట్టూ మురికినీటి గుంటలు ఉండకుండా చూడాలని చెప్పారు. దోమకాటుకు గురికాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల నివారణతో అనేక వ్యాధులు రాకుండా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనిట్ మలేరియా అధికారి వెంకన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో మలేరియా వ్యాధిపట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. మలేరియా వ్యాధి రాకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించా లన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమ త్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యాధులు వచ్చాక ఇబ్బందులు పడకుండా ఉండాలంటే వాటి గురించి జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్: స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రి ఆరోగ్య సిబ్బందితో పాటు నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఆశా కార్యకర్తలు మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో మాట్లాడుతూ దోమలు ప్రభలకుండా ఉండేందుకు గాను ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి ఇంట్లోని వ్యర్థ వస్తువుల్లో పేరుకున్న మురికి నీటిని, నీటి తొట్లను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. దోమ కాటువల్ల మలేరియా వ్యాధితో పాటు ఫైలేరియా (బోధకాలు)వ్యాధి ప్రభలతుందని, అదేవిధంగా డెంగీకి కూడా దోమలే కారణంగా పేర్కొన్నారు. వేసవిలో ఆరు బయట నిద్రించే వారు తప్పకుండా దోమ తెరను వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డా. బుస్రా ఫాతిమ, హెల్త్ సూపర్‌వైజర్ రఫీ, హెల్త్ అసిస్టెంట్‌లు మధుసూదన్‌రెడ్డి, సుశీల, సబ్‌యూనిట్ అధికారి పకీరప్పలతో పాట ఏఎన్‌ఎంలు. ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడితే చర్యలు

వికారాబాద్, ఏప్రిల్ 25 : వీధి విక్రేత లు, ప్లాస్టిక్ దుకాణాలలో నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే చర్యలు తప్పవని పర్యావరణ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు షాపులను మున్సిపల్ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించిన షాపుకు రూ. 2వేల జరిమానాను విధించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. ఆయనతో పాటు శానిటరీ జవాన్లు వినోద్, శంకర్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, మహేం దర్‌లు ఉన్నారు.

మర్పల్లి, ఏప్రిల్ 25: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై చెట్లు విరిగిపడడంతో పాటు జొన్న, మొక్క జొన్న, కూర గాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి

పారిశుధ్యం..అస్తవ్యస్తం

- ఇండ్ల పక్కనే మురికినీటి గుంట
- దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పేరిట ఏడాదిన్నరగా వృధాగా పైపులు



నారాయణపూర్ ఎస్సీ కాలనీ పక్కనే గల మురికినీటి గుంట

పరిగి, ఏప్రిల్ 25: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే కుటుంబాలు బాగుంటాయి, చుట్టుపక్కల ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉంటే గ్రామం బాగుంటుంది. అలాంటిది ఇండ్లకు పక్కనే పెద్ద మురికినీటి గుంటతో కాలనీ వాసులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓవైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో నానా అగచాట్లు పడుతున్నట్లు పరిగి మండలం నారాయణపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే గ్రామంలోని పలుచోట్ల నుంచి వచ్చే మురికినీరంతా ఒక్కచోట చేరి పెద్ద మురికినీటి గుంటగా మారింది. ఎస్సీ కాలనీని ఆనుకొని ఉన్నటువంటి రోడ్డు పక్కనే సంవత్సరం పొడవునా ఈ మురికినీరు నిలువ ఉంటుంది. వర్షాకాలంలో వర్షాలు కురిసినపుడు ఈ మురికినీరు ప్రధాన రహదారిపై నుంచి పారుతుంది. ప్రస్తుతం తీవ్రమైన ఎండలు కాస్తున్న ఈ సమయంలోనే మురికినీటి గుంటలో నీరు నిలువ ఉందంటే ఇక వర్షాకాలంలో ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రతి నిత్యం మురికినీరు పారుతున్న ఈ ప్రాంతం జనావాసాలకు పక్కనే ఉంటుంది. మురికినీరు ఎప్పటికపుడు వెళ్లిపోయేలే పెద్ద కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. దీంతో ఈ మురికినీటి గుంటలో దోమలు ఆవాసం ఏర్పరచుకుంటున్నాయి. అలాగే ప్రతి నిత్యం దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం ఉండడం లేదని వారు వాపోయారు. వర్షాకాలంలో ప్రధాన రహదారి పై నుంచే ఈ నీరు పారుతుంటే అందులో నుంచి వెళ్లాల్సి వస్తుందన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏమైంది ?

నారాయణపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం పైపులు తెచ్చి వేశారు తప్ప డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదని కాలనీవాసులు తెలిపారు. సుమారు ఏడాదిన్నర క్రితం ఎస్సీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని పేర్కొంటూ సిమెంటు పైపులు తీసుకువచ్చి మురికికాలువలో వేశారని, కొద్ది దూరం నాలుగైదు పైపులను అలాగే జాయింట్ వేశారు తప్ప కొంత లోతుకు తవ్వి పైపులు వేయలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న మురికికాలువలోనే పైపులు వేసి ఉండగా కాలువలో నుంచి మురికినీరు ప్రవహిస్తుంది. కొంత దూరంలో పైపులను అలాగే వేసి వదిలేశారు. ఇది నిర్లక్ష్యానికి నిదర్శనంగా కాలనీవాసులు పేర్కొంటున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనపుడు ఈ సిమెంటు పైపులు ఎందుకు తీసుకువచ్చి తమ ఇండ్ల మధ్య వేశారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి వెంటనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం జరిగేలా చూడాలని, లేనియెడల పైపులు తీసి వేస్తే కనీసం కాలువలో నుంచైనా మురికినీరు సక్రమంగా పారుతుందని అంటున్నారు. అలాగే పలుచోట్ల మురికికాలువలను కనీసం మూడు నెలలకు ఒకసారి సైతం శుభ్రం చేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లినపుడు ఈరోజు పంపిస్తానంటూ చెప్పడం తప్ప పని జరగడం లేదన్నారు. అలాగే ఎస్సీ కాలనీలోని ఇళ్ల పక్కనే గల స్థలంలో చెత్తా చెదారం పడివున్నా దాన్ని తొలగించడం లేదని, గాలి దుమారానికి చెత్త తమ ఇళ్లలోకి వస్తుందని పలువురు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకొని చెత్తను తీయించాలని కోరుతున్నారు.

ఎస్సీ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఏడాదిన్నర క్రితం తీసుకువచ్చి కాలువలో వేసిన పైపులు